# అనావిష్కృతం

నేననుకోవడమేగాని,
ఈ మంచుగడ్డని నేను పగలగొట్టలేను.
మన మధ్య మాటల వంతెన కట్టలేను.

ఇవ్వి నేను ప్రేమతో పెంచుకొన్న పువ్వులు
మరిమరీ ముడుచుకుపోవటమే తప్ప - సువాసనలై
విరజిమ్మడం వీటికి తెలీదు.
అమాయకంగా అన్నింటినీ పోగుచేసి పెడతాను.
నా పిచ్చిగాని,
నేనెవరితోనూ వీటిని పంచుకోలేను.

ఆలోచనలతో ప్రాంగణమంతా
అందంగా అలుకుతాను.
ఉత్సాహంతో ఊహల తోరణాలు కడతాను.
ఎవరెవరు వస్తారా- అని
ఎంతగానో ఎదురు చూస్తాను
నా ఆరాటమేగాని,
నేనెవర్నీ లోపలికి ఆహ్వానించలేను.

నా మాటలు నాలోనే కరిగిపోతాయి.
నా చిత్రాలు నాలోనే చెరిగిపోతాయి.
నేనెన్నో ప్రకటించాలని
ఎన్నుకొన్న సన్నివేశాలు
అతి ఉదాసీనంగా ముగిసిపోతాయి.
నా వెర్రిగాని,
ఈ తెర నేనెప్పటికీ తీయలేను.

మే, '92